

మట్టపల్లిలో నిత్య పూజలు

మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం నిత్యపూజలు నిర్వహించారు. - 10లో



అర్చకుడికి అరుదైన పురస్కారం

మాండ్రలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడు నరసింహాచార్యులుకు అరుదైన పురస్కారం దక్కింది. - 10లో



నూతన వేడుకలకు సిద్ధం

నూతన సంవత్సరం సందర్భంగా యాదాద్రి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు. - 10లో

ఆనంద, విషాదాల సమాహారం

2023లో మరపురాని గురుతులెన్నో..



కాల చక్రం గిర్రున తిరిగింది. మరికొన్ని గంటల్లో 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 వసంతంలోకి అడుగిడబోతున్నాం. నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి అంతా సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది కాలంలో ఎన్నో సంఘటనలు జరిగాయి. వీటిలో కొన్ని ఆనందాన్ని కలిగిస్తే మరికొన్ని విషాదాన్ని మిగిల్చాయి. జనవరి నుంచి డిసెంబర్ వరకు జరిగిన ఎన్నో తీపి చేదు ఘటనల్లో ముఖ్యమైనవి కొన్ని..

- సాక్షి నెట్‌వర్క్

జనవరి

- 18వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ఖమ్మంలో నిర్వహించిన సభకు వెళ్తూ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను కేసీఆర్ వారికి వివరించారు.

ఫిబ్రవరి

- 15వ తేదీన హైదరాబాద్‌కు వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ వద్ద పట్టాలు తప్పడంతో బీబీనగర్, భువనగిరి, రామన్నపేట స్టేషన్లలో పలు రైళ్లు నిలిచిపోయాయి.
- 21వ తేదీన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆరేళ్ల తర్వాత ప్రధానాలయంలో నిర్వహించారు.

మార్చి

- 18వ తేదీన బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భాను అరుణాచల్‌ప్రదేశ్ లో హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో మరణించారు. అంత్యక్రియలు బొమ్మలరామారంలో జరిగాయి.

ఏప్రిల్

- 5వ తేదీన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను ఓ కేసులో అరెస్ట్ చేసి యాదాద్రి జిల్లాలోని బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌లో 8 గంటల పాటు ఉంచారు.
- 8వ తేదీన బీబీనగర్ ఎయిమ్స్ భవన నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.
- 8వ తేదీన సికింద్రాబాద్ నుంచి తిరుపతికి నల్లగొండ మీదుగా వందేభారత్ రైలు ప్రారంభమైనది.

మే

- 17న ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన ఆరుగురు మహిళా కూలీలు దుర్మరణం పాలయ్యారు.
- 23న సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఉత్తమ ర్యాంకులు సాధించారు.

జూన్..

- 14వ తేదీన హైదరాబాద్‌లో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నివాసం, కార్యాలయంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఇది జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.
- 26వ తేదీన నల్లగొండ పట్టణంలోని ఫ్రూట్ కంపెనీలో ఇథిలిన్ గ్యాస్ సిలిండర్ పేలి పట్టణానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

జూలై

- 7వ తేదీన కోల్‌కతా నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు బొమ్మాయిపల్లి- పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్యకు రాగానే ముందుగా ఒక బోగి నుంచి మంటలు వచ్చాయి. వరుసగా ఐదు బోగీలు దగ్ధమయ్యాయి.
- 26నఫిలిప్స్ యాప్ పేరిట సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 300మంది నుంచి రూ.3 కోట్లకుపైగా తీసుకుని నిర్వాహకులు బోర్డు తిప్పేశారు.

ఆగస్టు

- 16వ తేదీన బీబీనగర్- నడికుడి రైలు మార్గంలో డబ్లింగ్(రెండో లైన్)కు కేంద్ర కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.
- 20వ తేదీన సూర్యాపేటలో ప్రగతి నివేదన సభ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. కలెక్టరేట్, మెడికల్ కళాశాల, ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు.
- 25వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ ముడుంబై పురుషోత్తమాచార్య జాతీయ చలన చిత్ర అవార్డుకు ఎంపికయ్యారు.

సెప్టెంబర్

- 2న నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఓరుగంటి రాములు మృతి చెందాడు.
- 4వ తేదీన మునుగోడు నియోజకవర్గంలోని చండూరును ఐదు మండలాలతో కలిపి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అక్టోబర్

- 13వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మహారాష్ట్రలోని పూణేకు కారులో తరలిస్తున్న 200కిలోల గంజాయిని యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పోలీసులతో పాటు ఎస్‌ఓటీ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి పట్టుకున్నారు.

నవంబర్

- 8వ తేదీన నల్లగొండలోని ఎంజీయూలో నిర్వహించిన 3వ స్నాతకోత్సవానికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
- 25వ తేదీన చింతపల్లి మండల కేంద్రంలో తెల్లవారుజామున పెళ్లి బృందం బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో పెళ్లికుమారుడి నాయనమ్మ మృతి చెందగా.. మరో 16 మందికి గాయాలయ్యాయి.
- 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగింది.

డిసెంబర్

- 3వ తేదీన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగింది. జిల్లాలో 12 స్థానాలకుగాను కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ ఒక చోట విజయం సాధించాయి.
- 7వ తేదీన రాష్ట్ర మంత్రులుగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.
- 11న భూ వివాదంలో చింతపల్లి మండలంలోని పాల్యతండాలో వ్యక్తి మృతిచెందాడు. ఈఘటనలో చింతపల్లి ఎస్ఐపై సస్పెన్షన్ వేటు పడింది.
- 20వ తేదీన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. అక్కడ చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. చేనేత కార్మికులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు.
- 25వ తేదీన నిడమనూరు మండల పరిధిలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఐదుగురు పెద్దవూర మండలం పుల్యతండా, మల్లెవానికుంటతండా వాసులు వీరంతా బంధువులు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

రాజీ మార్గమే రాజ మార్గం

- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల(సూర్యాపేట) : కేసుల విషయంలో రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికే మెగాలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చిన్న చిన్న ఘర్షణలు ఉంటే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన పెండింగ్ చలాన్ల రాయితీని వాహనదారులు వినియోగించుకోవాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న భార్యభర్తలు ఈ సందర్భంగా రాజీపడి న్యాయమూర్తుల సమక్షంలో ఒక్కటయ్యారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, బ్యాంకు, విద్యుత్, పోస్టల్, వెహికిల్, డ్రంక్అండ్ డ్రైవ్, గృహహింస, ఎక్సైజ్‌కు సంబంధించి 12,047 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎన్.అమరావతి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, డీఎస్పీ నాగభూషణం, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యులు జె.శశిధర్, వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, వెంకరత్నం, ప్రవీణ్‌కుమార్, పెండెం వాణి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



కేసు రాజీపడిన జంటను కలుపుతున్న న్యాయమూర్తులు

యుద్ధప్రాతిపదికన వంద పడకల వైద్యశాల

- ఎమ్మెల్యే పద్మావతి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి, చిత్రంలో కలెక్టర్ వెంకట్రావు

కోదాడ: కోదాడ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రస్తుతం ఉన్న 30 పడకల వైద్యశాల స్థలంలోనే వంద పడకల వైద్యశాలను బహుళ అంతస్తులో నిర్మాణం చేయాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి కోరారు. కోదాడలో 100 పడకల వైద్యశాల నిర్మాణంపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏడాదిలోపు పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ప్రస్తుత వైద్యశాలలో శిథిలావస్థలో ఉన్న పాతభవనాలతో పాటు వాటర్ ట్యాంక్, ఇతర ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ పాల్గొన్నారు. కలెక్టర్ 30 పడకల వైద్యశాల ఆవరణను పరిశీలించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం కృషి

కోదాడ: అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం కృషి చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని 17వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె జిల్లా కలెక్టర్ వెంకట్రావ్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. రేషన్‌కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్, కౌన్సిలర్ తమ్మినేని హనుమంతరావు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: జిల్లాలో డిసెంబర్ 31వ తేదీ రాత్రి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రాహుల్ హెగ్డే ఓ ప్రకటనలో సూచించారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, మహిళలను కించపరచకుండా, ప్రమాదాలకు దూరంగా ఉంటూ వేడుకల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. 31వ తేదీ రాత్రి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని మద్యం తాగి ఎవరూ రోడ్లపైకి రావొద్దని పేర్కొన్నారు. న్యూసెన్స్ చేసినా, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించా. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, బైక్ రేసింగ్‌లు నిర్వహించవద్దని, ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం ప్రమాదమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అక్రమ సిట్టింగులు, ఆరు బయట మద్యం సేవించడం, గుంపులు, గుంపులుగా తిరగడం లాంటి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. మద్యం దుకాణాల యజమానులు సమయపాలన పాటించాలని సూచించారు. ఆర్కెస్ట్రా, డీజేలు, మైకులు ఉపయోగించడం, బాణాసంచా పేల్చడం నిషేధమని తెలిపారు.

సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై పీడీయాక్ట్

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్ పల్లి (సూర్యాపేట) : నిర్దేశించిన సమయానికి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వని మిల్లర్లపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ వెంకట్రావు తెలిపారు. వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన సీఎంఆర్‌పై శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సీఎంఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సివిల్ సప్లయ్ డీఎం రాంపతి నాయక్, డీఎస్ఓ మోహన్ బాబు పాల్గొన్నారు.

మూడవ రోజు 56,874 దరఖాస్తులు

ప్రజాపాలన కార్యక్రమంలో మూడో రోజైన శనివారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 56,874 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు వెల్లడించారు. జిల్లాలోని 83 గ్రామ పంచాయతీల్లో 45744, 21 మున్సిపాలిటీల పరిధిలోని వార్డుల్లో 11,130 దరఖాస్తులు వచ్చి నట్లు వివరించారు. ప్రజలు అభయ హస్తం దరఖాస్తులు అందక ఎక్కడ కూడా ఇబ్బందులు పడవద్దని, ప్రజా పాలనకు వచ్చే ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని , కౌంటర్ల వద్ద పారదర్శకతతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదులు తప్పక అందించాలని సూచించారు. ప్రజలు అభయ హస్తం దరఖాస్తులను నింపడంలో హెల్ప్ డెస్క్ సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రజాపాలనకు విశేష స్పందన వస్తోందన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకట్రావు, అధికారులు

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఎత్తిపోతల పథకాలను నడిపేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ సీఈ ఓవీ రమేష్‌బాబు ఆదేశించారు. శనివారం చింతలపాలెం, మఠంపల్లి మండలాల్లోని నక్కగూడెం, అమరవరం, పెదవీడు, రామచంద్రాపురం, బెట్టితండా ఎత్తిపోతలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట నీటిపారుదల ఎస్ఈ నర్సింహారావు, ఈఈ శ్రీనివాస్, డీఈలు భిక్షం, అమరేందర్, స్వామి, ఏఈలు తుమ్మల శ్రీనివాస్, సతీష్, కానుగ శ్రీనివాస్, మండల రైతు జేఏసీ నాయకులు మోర్తాల నాగిరెడ్డి, కాకునూరి వెంకటరెడ్డి, కొప్పుల రవీందర్ రెడ్డి, కర్నాటి విజయలక్ష్మి, గజ్జల విజయసింహారెడ్డి, పల్లా శ్రీను, వీరంరెడ్డి నరేందర్‌రెడ్డి, దొండపాటి సంజీవరెడ్డి, అబ్దుల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీలకు పాల్పడుతున్న ఆరుగురి అరెస్ట్

గరిడేపల్లి : చోరీలకు పాల్పడుతున్న ఆరుగురిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా పెనుగ్రంచిప్రోలుకు చెందిన ముంగి గోపి, అద్దంకి నాగరాజు, అద్దంకి గురువయ్య, అద్దంకి పుల్లమ్మ, అద్దంకి నాగరాజు, అద్దంకి సుధారాణి ప్లాస్టిక్ బాటిల్స్, పైపులు వేరుకుంటున్నామని వచ్చి ఇళ్ల బయట ఉండే వస్తువులు అపహరిస్తున్నారు. ఇటీవల గరిడేపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మన్నెం ప్రభాకర్ రెడ్డి మోటార్‌ను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ముద్దాయి మృతిపై జనవరి 9న విచారణ

నల్లగొండ: పెద్దవూర మండలం గర్నెకుంట గ్రామానికి చెందిన ముద్దాయి ఇస్రాది వెంకటయ్య మృతిపై 2024 జనవరి 9గన దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2021 ఏప్రిల్ 17న ముద్దాయి మృతిచెందిన ఘటనపై విచారణ నిర్వహించేందుకు దేవరకొండ ఆర్డీవోను నియమించారు. దీంతో సంఘటనపై విచారిస్తున్నందున ఎవరైనా ఈ విషయంలో ఏమైనా సమాచారం చెప్పదలిస్తే విచారణకు హాజరై తెలియజేయాలని కోరారు.

వీఆర్ఏ అదృశ్యం


విష్ణు (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లిన వీఆర్ఏ అదృశ్యమయ్యాడు. భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన కొమ్ము విష్ణు(40) బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి కొంత కాలంగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. అందులో భాగంగానే ఈ నెల 24న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. ఫోన్ మాత్రం ఇంట్లోనే మర్చిపోయాడు. డ్యూటీకి వెళ్లిన భర్త తిరిగి సాయంత్రమైన ఇంటికి రాకపోయేసరికి మరుసటి రోజు విష్ణు కుటుంబసభ్యులు తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెదికినా ఆచూకీ మాత్రం లభించలేదు. ఇదిలా ఉంటే కొమ్ము విష్ణు గతంలో పలుమార్లు ఇంట్లో ఎవరికి చెప్పకుండానే బయటికి వెళ్లి కొద్దిరోజులకు తిరిగి వచ్చాడు. వీఆర్ఏ భార్య స్వాతి, తన భర్త కన్పించడం లేదని శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

పదేళ్ల తర్వాత వెలుగులోకి..

- తెలంగాణ ఉద్యమంలో డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన నళిని
- స్వరాష్ట్ర సాధన పోరులో మమేకం
- పరకాల ఉప ఎన్నికలో సైతం పోటీ
- 2012 తర్వాత వార్తల్లో లేని నళిని
- తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ డీఎస్పీ



సాక్షి, యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో ఉద్యమకారులపై లాఠీ ఝుళిపించలేక తన ఉద్యోగానికి రాజీనామా చేసిన మాజీ డీఎస్పీ దోమకొండ నళిని చాలా రోజుల తర్వాత వెలుగులోకి వచ్చారు. శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆమె కలిశారు. భువనగిరికి చెందిన నళిని తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో 2009లో తన డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ఆ పార్టీ నాయకత్వం హామీ ఇచ్చింది. డిసెంబర్ 7న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో నళిని అంశంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆమెకు మళ్లీ ఉద్యోగం ఇవ్వాలని నెటిజన్లు కామెంట్లు పెట్టారు. తెలంగాణ సాధన కోసం తన ఉద్యోగాన్ని త్యాగం చేసిన నళినికి తిరిగి ఉద్యోగం ఇవ్వాలని ఇటీవల జరిగిన పోలీసు శాఖ సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తిరిగి డీఎస్పీగా ఉద్యోగం ఇవ్వలేకపోతే అదే స్థాయిలో మరేదైనా ఉద్యోగం ఇచ్చే అంశంపైనా ఆలోచించాలని చెప్పారు. అవసరమైతే తనను కలిసేందుకు నళినికి అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలోనే సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నళిని కలిశారు.

కుటుంబ నేపథ్యం ఇదీ..

భువనగిరికి చెందిన దోమకొండ సత్యనారాయణ, సత్యవతి దంపతుల కూతురు నళినికి డిగ్రీ మొదటి చదువుతున్న సమయంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూరుకు చెందిన నరేందర్‌తో వివాహం జరిగింది. సంతానం అయిన తరువాత కూడా నళిని చదువు కొనసాగించారు. ఫార్మసీలో డిప్లొమా పూర్తి చేసి కాకతీయ యూనివర్సిటీ నుంచి బీఎడ్ కూడా చేశారు. గ్రూప్‌-1, గ్రూప్‌-2 పరీక్షలు రాశారు. గ్రూప్ -2కు ఎంపిక కావడంతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరారు. 2007లో గ్రూప్‌-1 రావడంతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అదే ఏడాది జూన్ 1న డీఎస్పీగా ఎంపికయ్యారు. డీఎస్పీ శిక్షణ పూర్తయ్యాక హసన్‌పర్తి, హన్మకొండలో ప్రొబేషనరీ డీఎస్పీగా పనిచేశారు. మొదటి పోస్టింగ్ కరీంనగర్‌లో ఇచ్చినప్పటికీ, తర్వాత ఆర్డర్‌ను అప్పటి ప్రభుత్వం మార్చి మెదక్ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చింది. 2009 డిసెంబర్‌9న తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమంపై అప్పట్లో జరిగిన అణచివేత, ఉద్యమకారులపై దాడులకు వ్యతిరేకంగా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. డీఎస్పీ స్థాయి అధికారి ఉద్యోగానికి రాజీనామా చేయడం అప్పట్లో సంచలనం కలిగించింది. అదే రోజు తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైనట్లుగా అప్పటి కేంద్రం ప్రకటించింది. ఉద్యోగానికి రాజీనామా చేసినప్పటికీ, అప్పట్లో ప్రభుత్వం దాన్ని ఆమోదించలేదు. తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ నళిని 2009 డిసెంబర్ 24న 19 పేజీల లేఖను సోనియాగాంధీకి రాశారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించినట్లుగా కేంద్రం ప్రకటనతో అప్పట్లో కొందరు ఉద్యమకారులు తిరిగి ఆమెను విధుల్లో చేరాలని ఒత్తిడి తేవడంతో రాజీనామా వెనక్కి తీసుకుంటూ లెటర్ ఇచ్చారు. ప్రభుత్వం కూడా తిరిగి విధుల్లోకి తీసుకుంది.

రెండోసారి రాజీనామా.. ఎన్నికల్లో పోటీ

రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ఆలస్యం కావడంతో నళిని 2011 నవంబరు 1న మరోసారి తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. అమరవీరుల స్ఫూర్తి యాత్ర నిర్వహించారు. ఢిల్లీలో దీక్ష చేస్తానని ప్రకటించడంతో ప్రభుత్వం నళిని రాజీనామా ఆమోదించకుండా, డిసెంబరు 4న విధులనుంచి తొలగించింది. 2011 డిసెంబరు 9న తెలంగాణ ఇవ్వాలని, ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్షకు దిగడంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. తెలంగాణవాదుల వినతి మేరకు దీక్ష విరమించారు. ఆ తర్వాత తెలంగాణ నళిని క్రాంతిసేన ఏర్పాటు చేశారు. 2012లో పరకాల ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం అదే ఏడాది నవంబరు 1న బీజేపీలో చేరినప్పటికీ ఆమె రాజకీయాల్లో చురుకుగా లేరు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి


మఠంపల్లి : ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్, అధికారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం), మఠంపల్లి : రోడ్డు పక్కన నిలిపిన లారీని ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ ఘటన చింతలపాలెం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామ పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న గంజి శ్రీనివాసరావు (48) పని నిమిత్తం శనివారం బైక్‌పై చింతలపాలెం మండలం దొండపాడుకు వచ్చాడు. పని ముగిసిన తర్వాత శుక్రవారం అర్ధరాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో చింతలపాలెం శివారులోని కోల్డ్ స్టోరేజీ వద్ద రోడ్డు పక్కన నిలిపిన లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ గద్దల రాధాకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గంజిశ్రీనివాసరావు మృతితో ఆయన స్వగ్రామం రఘునాథపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి దహన సంస్కారాలకు సర్పంచ్, కార్యదర్శిలు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో కుప్పకూలిన వృద్ధుడు

- ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి

చౌటుప్పల్ : కూతురు కుటుంబంలో నెలకొన్న కలహాల నేపథ్యంలో వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. కుటుంబసభ్యులు, పెద్దమనుషుల నడుమ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. ఆ క్రమంలో తీవ్రమైన మనోవేదనకు గురైన తండ్రి అకస్మాత్తుగా కుప్పకూలాడాడు. సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం ...మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన పిల్ల మారయ్య(60) కూతురు జ్యోతిని అదే గ్రామంలోని మేనల్లుడు శివకృష్ణతో వివాహం జరిపించాడు. ఇటీవల కొంతకాలంగా దంపతుల నడుమ గొడవలు జరుగుతున్నాయి. ఆ క్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చర్చల నిమిత్తం పోలీసులు ఇరువర్గాలకు శనివారం గడువు ఇవ్వగా స్టేషన్‌కు వచ్చారు. భార్యాభర్తల వివాదం కావడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తుల నడుమ మాట్లాడుకోవాలని పోలీసులు సూచించారు. ఆ క్రమంలో సాయంత్రం సమయంలో ఇరువర్గాలు బయటకు వెళ్లారు. అల్లుడి తరఫున గ్రామం నుంచి పెద్దమనుషులు సైతం వచ్చారు. కానీ తన తరఫున పెద్దమనుషులను పిలవలేదు. అదే సమయంలో తన కూతురికి ఇబ్బంది ఏమైనా జరుగుతుందేమోనని తీవ్రంగా వేదనకు గురైన మారయ్య అస్వస్థతకు గురయ్యాడు. తనకు ఏదోలా అవుతుందని వెంట ఉన్న కుటుంబసభ్యులు చెప్పడంతోపాటు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లాడు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుడు గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావడంతో ఆపార్టీ శ్రేణులు నివాళులు అర్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉంచారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

చింతపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. చింతపల్లిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన కందుల మురళీకృష్ణ(30) కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. మురళీకృష్ణ శుక్రవారం తన స్నేహితురాలు జెస్సీతో కలిసి స్కూటీపై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూరు సమీపంలోకి రాగానే వీరి స్కూటీ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న మురళీకృష్ణతో పాటు జెస్సీకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మురళీకృష్ణ శనివారం మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు చింతపల్లి ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపారు.

మహా రుచులు.. మన ముంగిట

- నగరాల్లో ఉండే ఆహార అలవాట్లు.. ఇప్పుడు పట్టణాలకు
- కార్పొరేట్ తరహాలో షాపులకు హంగులు
- వినియోగదారులను ఆకర్షించేందుకు విభిన్న పద్ధతులు
- జ్యూస్, ఐస్‌క్రీం, బిర్యానీ.. ఏదైనా వెరైటీనే



పుర్రెకోబుద్ధి.. జిహ్వకో రుచి.. అన్నారు పెద్దలు. మారుతున్న కాలంతో పాటు ప్రజలు రుచులు.. అభిరుచులు మారుతున్నాయి. దీనికి తోడు సామాజిక మాధ్యమాలు ప్రపంచాన్ని అరచేతిలోకి తీసుకొస్తున్నాయి. సంప్రదాయ వంటలు, రుచుల స్థానంలో కొంగ్రొత్త వంటలు, వంటకాలు వచ్చి చేరుతున్నాయి. వీటి పట్ల ప్రజలు ముఖ్యంగా యువత చూపుతున్న ఆదరణతో.. మహా నగరాలకే పరిమితమైన విభిన్న రుచులతో కూడిన టిఫిన్స్, ఐస్‌క్రీమ్స్, సలాడ్స్ ఇప్పుడు ద్వితీయ శ్రేణి పట్టణాలలోనూ దర్శనమిస్తున్నాయి. ఆకట్టుకునే పేర్లతో, అదిరిపోయే అలంకరణలతో వీటిని అందించే సంస్థలు (ఫ్రాంచైజీలు) ఏర్పాటవుతున్నాయి. పెట్టుబడులకు వెనుకడుగు వేయకుండా స్థానిక యువత వీటిని ఏర్పాటు చేసి తాము ఉపాధి పొందడంతో పాటు నలుగురికి పని కల్పిస్తున్నారు.

- సాక్షి, నల్లగొండ డెస్క్



లస్సీ షాప్

ఇప్పటికే మార్కెట్‌లో విభిన్నమైన ఐస్‌క్రీంలు లభిస్తుండగా.. కార్పొరేట్ తరహా ఐస్‌క్రీం షాపులు మరిన్ని వస్తున్నాయి. లస్సీ షాప్ పేరుతో అనేక ఫ్లేవర్స్‌తో కూడిన ఐస్‌క్రీంలు విక్రయిస్తున్నారు. వినియోగదారుల ఆర్డర్ మేరకు షాపులో అక్కడికక్కడే ఫ్లేవర్స్ మిక్స్‌చేసి ఇస్తున్నారు. తాము వివిధ చిన్న పట్టణాల్లో ఈ షాపులు ఏర్పాటు చేసినప్పటికీ నల్లగొండలో ఆదరణ, గిరాకీ బాగుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఫ్రాంచైజీల బ్రాండ్‌తో విక్రయిస్తున్నామని, మరిన్ని రకాలు అందుబాటులోకి తీసుకొస్తామని అంటున్నారు.



కొబ్బరి నీళ్లతో జ్యూస్

నల్లగొండ పట్టణంలో 'కోకోనట్ జ్యూస్ బార్' పేరుతో ఏర్పాటైన షాపులో ఏ ఫ్రూట్ జ్యూస్ అయినా కొబ్బరి నీళ్లతో కలిపి ఇస్తారు. బొప్పాయి జ్యూస్ కావాలంటే బొప్పాయి ముక్కలు గ్రైండ్ చేసి కొబ్బరి నీళ్లు కలిపి ఇస్తారు. అంతేకాకుండా ఎలాంటి ఫ్లేవర్స్ వాడకుండా నేచురల్ లేత కొబ్బరితో తయారు చేసిన ఐస్‌క్రీంలు కూడా విక్రయిస్తున్నారు. జ్యూస్‌లు ఎప్పటికప్పుడు షాపులో తయారు చేస్తున్నారు. ఐస్‌క్రీంలు మాత్రం ఈ షాపులకు ఫ్రాంచైజీలు సరఫరా చేస్తుంటాయి. కొబ్బరి బోండాలను ఆంధ్రప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. లేత కొబ్బరి ఉన్న బోండాలను వినియోగిస్తున్నారు. దీంతో వీరు తయారు చేసే జ్యూస్‌లకు మరింత తీపి వస్తుంది. వీటిని వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.



ఆదరణ బాగుంది



కోకోనట్ జ్యూస్‌ను వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. స్మూత్ షేక్స్, థిక్ షేక్స్, మాక్‌టైల్స్ పేర్లతో వర్గీకరణ చేసి యువతకు ఇష్టమైన రీతిలో జ్యూస్ తయారు చేసి ఇస్తున్నాం. వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నేచురల్ కొబ్బరి నీరు వాడుతున్నాం. ఎలాంటి ఫ్లేవర్స్ కలపడం లేదు. హైదరాబాద్‌లో మేము స్వయంగా చూసి.. నల్లగొండలో ఈ షాపు ప్రారంభించాం.

– హరీష్, 'కోకోనట్ జ్యూస్ బార్' నిర్వాహకుడు



శాకాహారంలో స్పెషల్

నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ వెరైటీలతో శాఖాహార భోజనం అందించే హోటళ్లు విభిన్నంగా, వినియోగదారులను ఆకర్షించే రీతిలో వస్తున్నాయి. 'తాజా ఆహార్' పేరుతో వెలిసిన హోటల్ శాకాహార వంటకాలతో ప్రత్యేకతను చాటుతోంది. టిఫిన్స్, భోజనం, స్టార్టర్స్‌ను పలు వెరైటీలలో అందిస్తోంది.

జైల్ మండి.. భలే ఉందండి

బిర్యానీ అంటే ఇష్టపడని వారు ఉండరు. మండి బిర్యానీ ఆరగించేందుకు బిర్యానీ ప్రియులు అమితంగా ఇష్టపడుతుంటారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మండి బిర్యానీకి ప్రత్యేకంగా పలు రెస్టారెంట్‌లు వెలిశాయి. అయితే వినూత్న రీతిలో పట్టణంలోని దేవరకొండ రోడ్డులో 'ది న్యూ జైల్ మండి ' బిర్యానీ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. రొటీన్‌కు భిన్నంగా జైల్ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన మండి రెస్టారెంట్ ఆకట్టుకుంటోంది. రెస్టారెంట్‌లో పూర్తిగా జైలు వాతావరణం ఉంటుంది. లోపలకి వెళితే జైల్‌లో ఉన్న అనుభూతి కలుగుతుంది. సాధారణంగా మండి బిర్యానీ రుచే వేరు. సౌదీ అరేబియాలో ఒక రకమైన బిర్యానీ ఇది. కారం పసుపు వాడకుండా 18 రకాల మసాల దినుసులతో వండుతారు. మండి బిర్యానీలో చికెన్ ఫ్రైడ్, క్రిస్పీ ఫ్రైడ్, చికెన్ జ్యూసీ, లాలీపాప్, మటన్ మండి, ఫిష్ మండి, ప్రాన్స్ మండి ఇలా చాలా రకాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా జైల్ మండిలో అందుబాటులో ఉన్నాయి.

వినూత్నంగా ఏర్పాటు చేశాం



మండీ బిర్యానీకి ఆదరణ బాగా ఉంది. రుచికరంగా ఉండడం వల్ల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. చూడడానికి జైల్ నిర్మాణం కలిగి ఉండడం మా రెస్టారెంట్ ప్రత్యేకత. జైల్ మాదిరిగా సెల్‌లను ఏర్పాటు చేశాము. మొత్తం 7 సెల్‌లు ఉన్నాయి. ఫ్యామిలీ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాము.

– ఎ.దర్శన్, నిర్వాహకుడు

జైల్‌లో కూర్చున్న అనుభూతి



జైల్ రూపంలో ఉండడం ఈ రెస్టారెంట్ ప్రత్యేకత. జైలులో కూర్చుని తిన్న ఫీలింగ్ మాకు కలుగుతుంది. స్నేహితులందరం కలిసి వారానికి రెండు నుంచి మూడు సార్లు వస్తుంటాము. రెస్టారెంట్ వినూత్నంగా ఉండడమే కాదు ఇక్కడ మండీ బిర్యానీ చాలా రుచికరంగా ఉంటుంది. ఫ్యామిలీ కూర్చోవడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

– గణేష్, హిమగిరి కాలనీ, నల్లగొండ


జైల్ మండి రెస్టారెంట్‌లో లోపలి అరేంజ్‌మెంట్స్


జైల్ మండి రెస్టారెంట్‌లోని సెల్‌లో కూర్చుని బిర్యానీ ఆరగిస్తున్న కుటుంబం

2.6 కిలోల గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం దేవరకొండ డీఎస్పీ గిరిబాబు కేసు వివరాలు వెల్లడించారు. నాలుగు రోజుల క్రితం గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన శివ నాగరాజు గంజాయి విక్రయించేందుకు కొండమల్లేపల్లికి వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతున్న క్రమంలో అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా పట్టణానికి చెందిన రమేష్, సిద్ధార్థ, ఆంజనేయులుకు విక్రయించేందుకు వచ్చినట్లు తెలుపడంతో వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి తరచూ గంజాయి కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాలను ఆరా తీస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన నలుగురిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కొండమల్లేపల్లి సీఐ రాఘవేందర్‌రెడ్డితో పాటు పోలీసు బృందాన్ని ఆయన అభినందించారు. సమావేశంలో నాంపల్లి సీఐ నవీన్‌కుమార్, కొండమల్లేపల్లి, గుడిపల్లి ఎస్ఐలు వీరబాబు, రంజిత్‌రెడ్డి, సిబ్బంది హేమనాయక్, నాగరాజు, గురువారెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నూతనకల్ : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. నూతన్‌కల్ మండల పరిధిలోని మాచనపల్లి గ్రామానికి చెందిన టంగటూరి వెంకన్న (42) ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలతో శుక్రవారం కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు మంటలు ఆర్పి అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఇనుపరాడ్లతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

చింతపల్లి : రోడ్డుపై నిలబడి మాట్లాడుతున్న వ్యక్తిపై కొందరు ఇనుపరాడ్లతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చింతపల్లిలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఐతమోని వెంకటయ్య(ధనరాజ్) శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో ఎక్స్ రోడ్డు నుంచి చింతపల్లిలోని తన ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో తనకు పరిచయం ఉన్న కృష్ణవేణితో మాట్లాడుతున్నాడు. గమనించిన ఇదే గ్రామానికి చెందిన కొప్పుల శ్రీను, కొప్పుల సత్తయ్య, శివ, శ్రీనులు వెంకటయ్యపై ఇనుపరాడ్‌లతో దాడి చేశారు. దీంతో వెంకటయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ చందారెడ్డి తెలిపారు.

104ఏ ఉత్తమ గవర్నర్‌గా వెంకట గురుమూర్తి


సదస్సులో కప్పు చూపుతున్న గురుమూర్తి

మునగాల: మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి జిల్లా 104ఏ గవర్నర్ వంగవేటి వెంకట గురుమూర్తి అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ గవర్నర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఇంటర్నేషనల్ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వెంకట గురుమూర్తి అవార్డు అందుకున్నారు. ఇందులో భాగంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు.